# నీట్‌పై సీబీఐ విచారణ చేపట్టాలి

- బాధ్యులపై కేంద్రం చర్యలు తీసుకోవాలి
- సింగరేణి అంశంపై ప్రధానితో సీఎం మాట్లాడుతారు
- జీవో 46పై త్వరలో సబ్ కమిటీ నిర్ణయం : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): 'నీట్' పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని కేంద్రప్రభుత్వానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి మాట్లాడుతూ, నీట్ పరీక్ష నిర్వహణలో, ఫలితాలలో అనేక మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని తెలిపారు. నెలరోజుల పాటు నీట్ దరఖాస్తులకు అనుమతించి, మళ్లీ వారం రోజులకు గడువు పొడిగించడం, జూన్ 14న ఫలితాలు రావాల్సి ఉండగా, జూన్ 4నే రిజల్ట్స్ ప్రకటించడం వంటి చర్యలతో అనుమానాలు మరింత పెరిగాయని మంత్రి విమర్శించారు. 63 మంది విద్యార్థులకు ఒకే ర్యాంకు రావడం, గ్రేస్ మార్కులను కలపడం అనుమానాలకు మరింత బలం చేకూర్చినట్టు అయిందని పేర్కొన్నారు. దీనిపై కేంద్రం స్పందించాలని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పై మళ్లీ నమ్మకం కలిపించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదేనని పేర్కొన్నారు.

### కొత్త బొగ్గు గనులు సింగరేణికే ఇవ్వాలి

సింగరేణి ద్వారానే కొత్త బొగ్గు గనులను ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్నట్టు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పునరాలోచన చేయాలని కోరారు. ఒకవైపు సింగరేణిని ప్రైవేట్ పరం చేసేదిలేదని అంటూనే.. మరోవైపు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే పనిలో కేంద్రం ఉన్నదని ఆరోపించారు. అన్ని బొగ్గు నిక్షేప సంస్థలు లాభాల్లో ఉన్నప్పటికీ కేంద్రం ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలని యోచించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కలిసి మాట్లాడతారని తెలిపారు. శాంతి భద్రతల పట్ల తమ ప్రభుత్వం అప్రమత్తంగా ఉన్నదని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం నుంచి నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, జీవో 46 పై త్వరలో సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఉద్యోగ నియామక ప్రక్రియకు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకొంటామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

# నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

- దీనిపై సమగ్ర విచారణ జరిపించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జూన్ 20 : నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం నిర్వహించిన దళిత హక్కుల పోరాట సమితి రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హర్యానలో ఒకే పరీక్షా కేంద్రంలో ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు, బీహార్‌లో రూ.30 లక్షలకు ప్రశ్నపత్రం అమ్ముకుంటున్నట్టు బయటపడిందని అన్నారు. నీట్ పరీక్ష అవినీతిమయంగా మారిందని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనకు సీపీఐ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సూచించారు. రూ.7లక్షల కోట్ల అప్పు ఉన్నదని, ప్రాజెక్టులు, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోలు చర్చపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టాలని హితవు పలికారు. ప్రజాపాలనలో 1.05 కోట్ల దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. 2 లక్షల రుణమాఫీ హామీని వెంటనే నెరవేర్చాలని, అవినీతి రహిత పాలన అందించే విధంగా ప్రభుత్వం ముందుకు సాగాలని కోరారు. సాగు చేసే భూములకు రైతుబంధు వర్తింపజేయాలని, రైతుబంధు పరిమితిపై అందరి సలహాలు తీసుకోవాలని సూచించారు.

# త్వరలో సీఎంవోలో మార్పులు?

- సగంమంది అధికారులకు ఉద్వాసన
- పీఎంవో నుంచి శేషాద్రికి పిలుపు!
- రేవంత్‌కు కావాల్సిన వ్యక్తులు సీఎంవోలోకి



హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కార్యాలయంలో త్వరలో భారీ మార్పులు జరుగబోతున్నట్టు సచివాలయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతున్నది. సగానికిపైగా అధికారులను మార్చుతున్నారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టగానే సీనియర్ అధికారి శేషాద్రిని సీఎంవో ముఖ్యకార్యదర్శిగా నియమించారు. మిగతా బృందాన్ని సైతం ఏరికోరి ఎంచుకున్నారు. ఒకరిద్దరు రాజకీయ కారణాల రీత్యా వచ్చినట్టు అప్పట్లోనే ప్రచారం జరిగింది. తాను అనుకున్నంత వేగంగా పనులు జరగడం లేదని, కీలకమైన నిర్ణయాలు తీసుకునే సమయంలో సరైన మార్గనిర్దేశనం చేయడం లేదని సీఎం అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా గత నెల 18న క్యాబినెట్ సమావేశం విషయంలో జరిగిన రచ్చ దీనికి ఆజ్యం పోసిందని చెప్పుకుంటున్నారు. ఎన్నికల సంఘం అనుమతి లేకపోవడంతో క్యాబినెట్ సమావేశం వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా క్యాబినెట్ సమావేశం నిర్వహించవచ్చా? లేదా? ఎజెండాలో ఎలాంటి అంశాలు ఉంటే ఈసీ సులభంగా అనుమతి ఇస్తుంది? వంటి ప్రాథమిక అంశాలపై కూడా సరైన అవగాహన లేకపోతే ఎలా అని సీఎం, మంత్రులు అసహనం వ్యక్తం చేసినట్టు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. తాజాగా విద్యాశాఖలో జరిగిన 'పుస్తకాలు వెనక్కి' వ్యవహారం సెగలు సైతం సీఎంవో వరకు తాకాయని చర్చ జరుగుతున్నది. మరోవైపు సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రికి కేంద్ర ప్రభుత్వం నుంచి పిలుపు వచ్చినట్టు చెప్తున్నారు. గతంలో ఆయన పీఎంవోలో సుదీర్ఘకాలం పనిచేశారు. ఈ నేపథ్యంలోనే ఆయనను మరోసారి పీఎంవోలోకి రావాలని కోరినట్టు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో సీఎంవోలో ప్రక్షాళన చేయాలని సీఎం నిర్ణయించినట్టు తెలిసింది. త్వరలో వివిధ శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులను మారుస్తారని సమాచారం. ఇప్పటికే ఫైల్ సీఎం దగ్గరికి చేరిందని సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో భాగంగానే సీఎంవో నుంచి ఇద్దరు ముగ్గురిని బయటికి పంపి, ఆ స్థానంలోకి తనకు కావాల్సిన వ్యక్తులను తీసుకురావాలని భావిస్తున్నట్టు సమాచారం.

## 17.5 లక్షల ఎకరాల్లో పంటల సాగు

- రెండు నెలల కోటా ఎరువుల కోసం కేంద్రానికి లేఖ : మంత్రి తుమ్మల



హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఈ నెల 19 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 17.5 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. వానకాలం సాగు, ఎరువుల లభ్యతపై గురువారం హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పత్తి 15.6 లక్షల ఎకరాల్లో, కంది 76 వేల ఎకరాల్లో సాగైనట్టు చెప్పారు. జూలై, ఆగస్టు నెలల ఎరువుల కోటాను ముందుగానే విడుదల చేయాలని కోరుతూ కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్టు తెలిపారు. ఈ సీజన్‌కు 10.4 లక్షల టన్నుల యూరియా, 2.4 లక్షల టన్నుల డీఏపీ, 10 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులను కేంద్రం కేటాయించిందని చెప్పారు. జూలై చివరి నాటికి 5.65 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటికే 8.35 లక్షల టన్నులు, 1.57 లక్షల టన్నుల డీఏపీ అవసరం కాగా 1.47 లక్షల మెట్రిక్ టన్నులను ఉంచినట్టు తెలిపారు. 1.3 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులకు గాను 5.37 లక్షల మెట్రిక్ టన్నులను అందుబాటులో ఉంచినట్టు వివరించారు. ఈ-పాస్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరిగేలా చూడాలని మంత్రి ఆదేశించారు.

## మహిళాశక్తి క్యాంటీన్లు బ్రాండ్‌గా ఎదగాలి

- సంఘాల బలోపేతానికే వడ్డీలేని రుణాలు
- కల్తీ పదార్థాలు, వస్తువులపై అధికారులు, మహిళా సంఘాలు యుద్ధం చేయాలి
- డీఆర్‌డీవోల సమీక్షలో మంత్రి సీతక్క



హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): మహిళా ఉన్నతితోనే తెలంగాణ ప్రగతి సాధ్య పడుతుందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చెప్పారు. మహిళా సంఘాల మరింత బలోపేతానికే మహిళా శక్తి కార్యక్రమాలు అమలుచేస్తున్నట్టు తెలిపారు. మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలని, కల్తీ వస్తువులపైన అధికారులు, మహిళా సంఘాలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో జిల్లా డీఆర్డీవో, అదనపు డీఆర్డీవోలతో మహిళా శక్తి రాష్ట్రస్థాయి కార్యాచరణ ప్రణాళిక తయారీపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సంస్థ సీఈవో కాత్యాయనీతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఆధార్ కేంద్రాలు, మీ సేవ సెంటర్లు, పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలు, క్యాంటీన్లు, స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసేలా మహిళా సంఘాలకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పల్లె రుచులు, ఇప్పపువ్వు లడ్డులు, నన్నారి వంటి సంప్రదాయక పానీయాలను పట్టణాలకు పరిచయం చేయాలని సూచించారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వమే అందజేస్తున్నదని చెప్పారు. మహిళలు అభివృద్ధి చెందిన తర్వాత ప్రభుత్వాలకే రుణాలు ఇచ్చే స్థాయికి ఎదుగుతారని తెలిపారు. ఆగస్టు 15 వరకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో జత యూనిఫామ్ ఇచ్చేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో పీఆర్ ఆర్‌డీ స్పెషల్ కమిషనర్ షఫీ ఉల్లా, ఈఎస్డీ కమిషనర్ రవికిరణ్, శ్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, వివిధశాఖల అధికారులు, డీఆర్డీవోలు పాల్గొన్నారు.

## మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్: సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ సిద్ధాంత కర్త, జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయనను సీఎం స్మరించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ప్రకటించామని గుర్తుచేశారు. గోల్కొండ, సికింద్రాబాద్, లాల్ దర్వాజ దేవాలయాల కమిటీ సభ్యులు సీఎంను ఆయన నివాసంలో కలిసి ఆషాఢ బోనాలకు రావాలని ఆహ్వానపత్రిక అందించారు.

## లోకం పోకడ




నీ సీటు లోపలికి మార్చాం,, నడువ్!

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నిజామాబాద్ | 37.2°c | 25.4°c |
| రంగారెడ్డి | 37.2°c | 23.9°c |
| నల్లగొండ | 37.0°c | 25.0°c |
| మహబూబ్‌నగర్ | 36.2°c | 27.4°c |
| ఖమ్మం | 35.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 34.4°c | 25.3°c |
| వరంగల్ | 34.0°c | 26.0°c |
| కరీంనగర్ | 33.0°c | 26.0°c |
| ఆదిలాబాద్ | 32.3°c | 24.2°c |
| మెదక్ | 24.3°c | 36.9°c |



రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మంత్రులు రాజనరసింహ, పొన్నం

## 89 లక్షల మంది పిల్లలకు డీవార్మింగ్ ట్యాబ్లెట్లు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా 89,52,024 మంది పిల్లలకు అల్బెండజోల్ ట్యాబ్లెట్లు అందజేసినట్టు వైద్యారోగ్య శాఖ తెలిపింది. మొత్తం 96,05,790 మందికి ట్యాబ్లెట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. మొదటిరోజే 93.19 శాతం మందికి వేసినట్టు పేర్కొన్నది. మిగతావారికి ఈ నెల 27న అందజేస్తామని తెలిపింది.

### నేడు క్యాబినెట్ భేటీ

హైదరాబాద్, జూన్ 20(నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో జరగనున్నది. సమావేశంలో రుణమాఫీని ప్రధాన ఎజెండాగా తీసుకొని చర్చించనున్నారు. దీంతోపాటు రాష్ట్ర బడ్జెట్ పద్దులు, అసెంబ్లీ సమావేశాలను ఎప్పటి నుంచి నిర్వహించాలనే అంశంపై కూడా చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. వీటితోపాటు మరికొన్ని అంశాలను కూడా ఎజెండాలో ఉంచినట్టు సమాచారం.

### 24న కాళేశ్వరంపై చర్చావేదిక

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): 'కాళేశ్వరాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై డాక్టర్ బీఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 24వ తేదీన కరీంనగర్ ఫిలింభవన్‌లో చర్చావేదికను నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10గంటలకు ఫిలింభవన్‌లో చర్చావేదిక ప్రారంభమవుతుందని డాక్టర్ బీఎన్ రావు ఫౌండేషన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రముఖ జలవనరుల నిపుణులు వీ ప్రకాశ్, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ కే కృష్ణమూర్తి, విశ్రాంత ఎస్ఈ భీమనాతిని సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొననున్నారని వివరించింది. చర్చలో ఇంజినీర్లు, డాక్టర్లు, న్యాయవాదులు, మేధావులు, రచయితలు, పాత్రికేయులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చింది.



సెల్యూట్ తెలంగాణ ర్యాలీలో బీజేపీ కార్యకర్తలు అందజేసిన గదను ఎత్తి చూపుతున్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్. చిత్రంలో ఎంపీలు లక్ష్మణ్, ఈటల, విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

# వచ్చే ఎన్నికల్లో మాదే అధికారం

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 88 మంది ఎమ్మెల్యేలతో అధికారంలోకి వస్తాం
- బీజేపీ కార్యకర్తలకు నమస్కరిస్తున్నా
- 'సెల్యూట్ తెలంగాణ' ర్యాలీలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తమదే అధికారం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ పార్టీకి రాష్ట్రంలో 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉన్నారని, రాబోయే శాసనసభ ఎన్నికల్లో 88 మంది ఎమ్మెల్యేలతో అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో గురువారం 'సెల్యూట్ తెలంగాణ' పేరుతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బేగంపేట విమానాశ్రయం నుంచి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు బీజేపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలను సన్మానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలందరికీ శిరసు వంచి సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ప్రజలను సంఘటితం చేయాలని పిలుపునిచ్చారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపును కార్యకర్తలకు అంకితం చేస్తున్నామని తెలిపారు. అనంతరం నేతలు భాగ్యలక్ష్మి ఆలయానికి వెళ్లారు. బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సెల్యూట్ తెలంగాణ కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. ప్రస్తుతం రాజాసింగ్ మహారాష్ట్ర పర్యటనలో ఉన్నారని ఆయన సన్నిహితులు చెప్తున్నారు. అయితే అలక వీడకపోవడం వల్లే మహారాష్ట్రలో ఉండిపోయారని పలువురు చెప్పుకుంటున్నారు.

# ఎమ్మెల్యే ఇంటిపై ఈడీ దాడులు

- మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి నివాసంలోనూ సోదాలు
- రాత్రి 9 గంటల వరకూ తనిఖీలు
- దాడుల వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆరోపణ



ఈడీ దాడుల అనంతరం పటాన్‌చెరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సంగారెడ్డి, జూన్ 20 (నమస్తే తెలంగాణ)/పటాన్‌చెరు: పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి నివాసాలపై గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు జరిపింది. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన సోదాలు రాత్రి 9.45 గంటల వరకు కొనసాగాయి. పటాన్‌చెరు పాతపట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో, శాంతినగర్‌లోని మధుసూదన్‌రెడ్డి నివాసంలో ఈడీ విడివిడిగా సోదాలు నిర్వహించింది. ఈడీ డిప్యూటీ డైరెక్టర్ పర్యవేక్షణలో 30 మంది సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. మొదట ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నివాసంలో తనిఖీలు చేపట్టిన ఈడీ అధికారులు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అన్ని పత్రాలను పరిశీలించారు. మహిపాల్‌రెడ్డితోపాటు కుటుంబసభ్యులను విడివిడిగా ప్రశ్నించారు. అనంతరం ఆకస్మికంగా ఎమ్మెల్యే నివాసం సమీపంలో ఉన్న కార్యాలయంలో, అలాగే వాహనాలను కూడా తనిఖీ చేశారు. ఎమ్మెల్యేకు సంబంధించిన వాహనాల్లో ఉన్న ఫైళ్లు, పత్రాలను పరిశీలించారు. తనిఖీలు కొనసాగుతున్నంతసేపు ఎవరినీ ఎమ్మెల్యే నివాసంలోకి అనుమతించలేదు. ఈడీ అధికారులు మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి నివాసాల నుంచి ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కొన్ని జిరాక్స్ పత్రాలను తీసుకెళ్లినట్టు తెలిసింది. మధుసూదన్‌రెడ్డిని అరెస్టు చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ ఈడీ అధికారులు ఎలాంటి అరెస్టులు చేయకుండా హైదరాబాద్ తిరుగుపయనం అయ్యారు. బినామీ పేర్లతో వ్యాపారాలు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి ఫిర్యాదులు అందటం వల్లనే ఈడీ అధికారులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంటిపై దాడులు చేసినట్టు తెలిసింది.

### రాజకీయకక్షతోనే ఈడీదాడులు : మహిపాల్‌రెడ్డి

తనను రాజకీయంగా ఎదుర్కొనలేకనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షపూరితంగా ఈడీ, ఐటీ దాడులు చేయిస్తున్నట్టు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. ఈడీ సోదాలు ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈడీ అధికారులకు తాను, తన కుటుంబసభ్యులు పూర్తిగా సహకరించినట్టు తెలిపారు. పార్టీ మార్పుతోపాటు ఇతర రాజకీయ అంశాలు దాడుల వెనుక దాగి ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం సందర్భం కాదని తనపై జరుగుతున్న రాజకీయకుట్రల వివరాలను సమయం వచ్చినప్పుడు వెల్లడిస్తానని అన్నారు. రాజకీయంగా తనను బలి చేసేకుట్ర జరుగుతున్నదని దానిని సమర్థంగా ఎదుర్కొంటానని ధీమా వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తాను, తన కుటుంబసభ్యులు ఎలాంటి వ్యాపారాలు చేయటంలేదని చెప్పారు. నిబంధనలు అనుమతించిన మేరకే బంగారం, ఇతర వస్తువులు కలిగి ఉన్నామని అన్నారు. ఈడీ తనను, కుటుంబసభ్యలను విచారించిందని, తాము నిబంధనలు అతిక్రమించినట్టు ఎక్కడా తేలలేదని తెలిపారు. తన ఇంటి నుంచి ఈడీ ఏమీ స్వాధీనం చేసుకోలేదని చెప్పారు. తమ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన జిరాక్స్ ప్రతులను మాత్రమే తీసుకెళ్లారని తెలిపారు. ఈడీ సోదాలు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈడీ దాడులు వంద శాతం రాజకీయ ప్రేరేపితమైనవని ఆరోపించారు. తనపై జరుగుతున్న కుట్రలను రాజకీయంగా ఎదుర్కొంటానని అన్నారు.

## రుణమాఫీ ఒకేదఫాలో!

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఆగస్టు 15 వరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సందర్భంగా దేవుళ్ల మీద ఒట్టు పెట్టారు. అయితే, ఇందు కోసం సుమారు రూ.35 వేల కోట్ల నిధులు అవసరమని లెక్క తేలడంతో ప్రభుత్వం ఆలోచనలో పడింది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు కోతలు పెట్టాలని, కేంద్రం అమలుచేస్తున్న పీఎం కిసాన్ పథకం నిబంధనలను రుణమాఫీకి వర్తింపచేయాలని ప్రభుత్వం ఆలోచన చేసినట్టు తెలిసింది. ఈ నిబంధనలు అమలు చేస్తే రాష్ట్రంలోని సగం మంది రైతులకు రుణమాఫీ వర్తించదు. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో కోతలు పెట్టాలా? వద్దా? అనేదానిపై క్యాబినెట్‌లో నిర్ణయించే అవకాశం ఉన్నది.

## బౌరంపేట భూములపై వివరాలివ్వండి

- రాష్ట్ర సర్కారుకు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా, దుండిగల్ -గండిమైసమ్మ మండలం, బౌరంపేటలో కోట్లాది రూపాయల విలువైన పదెకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా తీసుకున్న చర్యలు ఏమిటో తెలపాలని కోరుతూ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. ప్రైవేటు నిర్మాణ సంస్థ ఆక్రమణలకు పాల్పడుతున్నదనే అభియోగాల నేపథ్యంలో వాటికి సంబంధించిన వివరాలు కూడా అందజేయాలని ఆదేశించింది. బౌరంపేటలోని సర్వే నం.166లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని వజ్ర బిల్డర్లు, ఇతర ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసి అక్రమంగా లేఔట్ వేస్తుంటే అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తూ సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన జీ రఘువీర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాఘవరావు అనే వ్యక్తికి ఉన్న 10 ఎకరాలకు సర్వే నెం.166లో సబ్ నంబర్లు వేసి విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం ప్రతీక్‌రెడ్డి వాదనలు వినిపించారు. అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ ప్రతివాదన చేస్తూ, ఆ భూముల్లో 80 మంది దాకా ఉన్నారని, వారందరినీ ప్రతివాదులుగా చేయాల్సివున్నదని, వివరాలు తెలుసుకుని కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. దీంతో విచారణ జూలై రెండో తేదీకి వాయిదా పడింది.

## అన్నారం బరాజ్‌ను సందర్శించిన నిపుణుల బృందం

మహదేవపూర్, జూన్ 20 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బరాజ్‌ను సెంట్రల్ వాటర్ పవర్ రిసెర్చ్ స్టేషన్ నిపుణుల బృందం గురువారం సందర్శించింది. పుణెకు చెందిన జియోఫిజికల్ శాస్త్రవేత్త డాక్టర్ ధనుంజయ్ నాయుడు నేతృత్వంలోని నిపుణుల బృందం బరాజ్‌ను పరిశీలించింది. బృందం సభ్యులు ఇంజనీరింగ్ అధికారులతో సాంకేతిక అంశాలపై చర్చించారు. బరాజ్‌లో 22 నుంచి 44 గేట్ల వద్ద చేపట్టిన సీపేజ్, మరమ్మతు పనులను పరిశీలించారు. వారి వెంట రామగుండం సర్కిల్ సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ కరుణాకర్, ఈఈ యాదగిరి, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. అలాగే మేడిగడ్డ బరాజ్ వద్ద నిపుణుల బృందం ఆధ్వర్యంలో ఈ నెల 5న ప్రారంభమైన పరిశోధనలు కొనసాగుతున్నాయి. బరాజ్‌లో లోపాల అధ్యయనానికి కుంగిన పియర్ల సమీపంలో డ్రిల్ చేసి నమూనాలు సేకరిస్తున్నారు. వీటిని పుణెకు పంపించి పరీక్షించనున్నట్టు తెలిసింది. ఏడో బ్లాక్ వద్ద బరాజ్ దిగువన షీట్ ఫైల్స్, గ్రౌటింగ్, సీసీ బ్లాక్‌ల రీఅరేంజ్‌మెంట్ పనులు జరుగుతున్నాయి. 20వ గేట్‌ను కట్ చేయగా విడిభాగాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ పనులను భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతిరావు గురువారం పరిశీలించారు.

## స్థానికత ఆధారంగా గురుకుల సిబ్బంది బదిలీ

- 286 మందికి లోకల్ జోన్‌లో పోస్టింగ్
- ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 317 జీవో అమలు ద్వారా స్థానికేతర ప్రాంతాల్లో పోస్టింగ్‌లు పొందిన గిరిజన గురుకులంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులను తిరిగి స్థానికత ఆధారంగా పోస్టింగ్‌లు కల్పిస్తూ బదిలీ చేశారు. ఈ మేరకు ఎస్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తంగా 286 మంది గిరిజన గురుకుల సిబ్బందికి వారి వెబ్‌ఆప్షన్ ఆధారంగా పోస్టింగ్‌లను ఇచ్చారు. మల్టీజోనల్, జోనల్, డిస్ట్రిక్ లెవల్‌లో గిరిజన గురుకుల సొసైటీలో మొత్తంగా 1,487మంది టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఉన్నారు. 317 జీవో అమలుతో వారిలో దాదాపు 370 మంది ఉద్యోగులు స్థానికేతర ప్రాంతాల్లో పోస్టింగ్‌లను పొందారు. దానిని సవాల్ చేస్తూ 40 మంది ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. వారి నియామకంపై ప్రస్తుతం స్టేటస్‌కో కొనసాగుతున్నది. వారిని మినహాయించి మిగిలిన 330 మంది ఉద్యోగులకు స్థానికత ఆధారంగా పోస్టింగ్‌లను ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఆయా ఉద్యోగుల నుంచి 15న వెబ్‌ఆప్షన్స్‌ను గిరిజన సొసైటీ స్వీకరించింది. వారిలో 286 మందికి స్థానికత ఆధారంగా పోస్టింగ్‌లను కల్పిస్తూ సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో స్కూల్ ప్రిన్సిపల్స్ 11మంది, డిగ్రీ లెక్చరర్స్ 17మంది, జూనియర్ లెక్చరర్స్ 21మంది, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ 02, టీజీటీ 188, జూనియర్ కాలేజీ లైబ్రేరియన్ 04, పీజీటీ 19, స్కూల్ పీడీ 03, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 10, సూపరింటెండెంట్ 1, స్టాఫ్ నర్సులు 06, ఇతర సహాయ సిబ్బంది 4 ఉన్నారు. బదిలీ పొందిన వారిని రిలీవ్ చేయడంతోపాటు, పోస్టింగ్ పొందిన వారిని రిపోర్ట్ చేసిన వెంటనే జాయిన్ చేసుకోవాలని అన్ని గిరిజన గురుకులాల ప్రిన్సిపాల్స్‌కు సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అవుతున్న ప్రిన్సిపాల్స్ సదరు గిరిజన గురుకులంలోని సీనియర్ డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీలకు బాధ్యతలను అప్పగించి స్వతహాగా రిలీవ్ కావాలని మార్గదర్శకాలను జారీ చేశారు.

### స్థానికత పోస్టింగులపై టిగారియా హర్షం

స్థానికత ఆధారంగా పోస్టింగ్‌లను కల్పించిన ప్రభుత్వానికి, ఎస్టీ సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి, అధికారులకు తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టిగారియా) కృతజ్ఞతలు తెలిపింది. టిగారియా అధ్యక్షుడు మామిడి నారాయణ, జనరల్‌సెక్రటరీ మధుసూదన్ హర్షం వ్యక్తం చేశారు.